
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.7 ; కనిష్ఠం 11.8
కామారెడ్డి జిల్లా వార్తలు
మంగళవారం 14 జనవరి 2025



24వ వార్డులో నూతన బోరు ప్రారంభం

కామారెడ్డి టౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని 24వ వార్డులో నీటి సమస్య ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు తలెత్తడంతో బోరు మోటార్‌ను సోమవారం చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రతను పాటించాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఇల్లెందుల లతావేణు తదితరులు పాల్గొన్నారు.



పేదల చెంతకు మరో..

నాలుగు పథకాలు!





- పథకాల అమలుకు ఈనెల 26న ముహూర్తం
- 16వ తేదీ నుంచి కసరత్తు
- రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు
- గ్రామ, వార్డు సభల్లో లబ్ధిదారుల ఎంపిక
- ఇప్పటికే చివరి దశకు చేరిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే
- రైతు భరోసాపై మార్గదర్శకాలు విడుదల

కామారెడ్డి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలమేరకు మరో నాలుగు సంక్షేమ పథకాలకు త్వరలోనే శ్రీకారం చుట్టనుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీకి సన్నాహాలు చేస్తోంది. ఈ నాలుగు సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందేలా కసరత్తు ప్రారంభించింది. కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలు ఎదురుచూస్తున్న రేషన్‌కార్డుల జారీ, ఇంళ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రైతన్నల ఆశలకు తగ్గట్టుగా రైతు భరోసా, కూలీలకై ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటివి అమలు చేయడానికి రంగం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి ఈ నెల 16వ తేదీ నుంచి తుదిదశ కసరత్తు చేపట్టనున్నారు. ఇదంతా పూర్తయ్యాక ఈనెల 26వ తేదీన గ్రామసభల ద్వారా ఎంపిక చేసిన పథకాలను పేద ప్రజల చెంతకు చేర్చడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

వెలువడిన మార్గనిర్దేశకాలు

జిల్లాలో రైతు భరోసాపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. సంక్రాంతి నుంచి రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాలో జమ చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈనెల 26వ తేదీ నుంచి అర్హులైన రైతులకు ప్రతీ సంవత్సరం ఎకరానికి రూ.12 వేల చొప్పున నగదు జమ చేసే ప్రక్రియ మొదలుపెట్టనుంది. ఇందుకు సంబంధించిన మార్గ నిర్దేశాలను ప్రభుత్వం జారీ చేసింది. వానాకాలం, యాసంగి సీజన్‌లలో రూ.6వేల చొప్పున నగదు అందించనుంది. ప్రస్తుతం ప్రభుత్వం రూపొందించిన విధివిధానాల ప్రకారం ఎందరికి భరోసా దక్కుతుందో ఈనెల 26వ తేదీన తేలనుంది. ఆరోజే గ్రామసభల ద్వారా అర్హులను ప్రకటించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో రైతుబంధు పేరిట కొండలు, గుట్టలు, వాగులు, చెరువులతో పాటు ఇళ్ల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటుకు బదిలీ చేసిన భూములకు సైతం రైతుబంధు అందేది. అయితే ఇప్పుడు మాత్రం సాగులో ఉన్న, సాగుకు యోగ్యమైన భూములకు రైతుభరోసా ఉంటుందని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. భూ భారతి పోర్టల్‌లో నమోదై ఉన్న సాగు భూములకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించనుంది. జిల్లాలో 5.20 లక్షల ఎకరాల్లో సాగు భూములు ఉన్నాయి. ఇందులో 3.04 లక్షల మంది రైతులకు రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయాన్ని పొందుతూ వచ్చారు. లక్ష ఎకరాల వరకు సాగులో లేని భూములు ఉన్నాయి.

భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

భూమి లేని నిరుపేదలకు ప్రతీ సంవత్సరం రూ.12వేల చొప్పున రెండు విడతలుగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో అమలయ్యే ఈ పథకానికి కూడా ఈనెల 26 నుంచి ముహూర్తం నిర్ణయించారు. భూమి లేని నిరుపేదల కుటుంబాన్ని యూనిట్‌గా ఎంపిక చేస్తారు. కుటుంబంలో ఎవరైన ఒకరు కనీసం 20రోజుల పాటు ఉపాధి హామీ పథకం కింద పనిచేసి ఉండాలి. జిల్లాలో 5.50లక్షల జాబ్‌కార్డులు ఉండగా 2 లక్షల మందికి పైగా ఉపాధి కూలీలు ఉన్నారు. ఇందులో ఎందరు అర్హత సాధిస్తారో త్వరలోనే తేలనుంది.

చివరి దశకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ఇందిరమ్మ ఇళ్ల పంపిణీపై ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఇళ్ల కేటాయింపుపై గత 20 రోజులుగా లబ్ధిదారుల ఎంపికకు సర్వే చేపడుతున్నారు. ఈ పథకం కూడా ఈనెల 26వ తేదీ నుంచి అమలు కానుంది. ప్రజాపాలన సభలో జిల్లాలో 2,38,682 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటి ఆధారంగా అధికారులు చేపట్టిన సర్వే చివరి దశకు చేరుకుంది. ఈ సర్వేపై అధికారులు మరోసారి తనిఖీలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల్లో చేపడుతారు. తొలి దశలో ప్రతీ నియోజకవర్గానికి 3500ల చొప్పున ఇళ్లు కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రతిపాదికన జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు 14 వేలకు పైగా ఇళ్లు మంజూరు కానున్నాయి. ప్రతీ ఇంటికి 5లక్షల రూపాయల చొప్పున నాలుగు విడతల్లో నగదు అందజేస్తారు. దీంతో పాటు రేషన్‌కార్డుల జారీకి సైతం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

క్రీడా పోటీల్లో..

గెలుపోటములు సహజం

రాజంపేట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమడ్ల గ్రామంలో శని, ఆదివారాల్లో కర్నాల రఘునాథ్ స్మారక రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. విజేతలకు ఎస్‌ఐ పుష్పరాజ్ బహుమతులు అందించారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు అభినందనలు తెలుపుతూ ఎలాంటి సంఘటనలు జరగకుండా నిర్వహించిన ఆర్గనైజేషన్ నిర్వాహకులను ప్రశంసించారు. క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజమని అన్నారు. మరోసారి నిర్వహించినప్పుడు తలమడ్ల జట్టు ఫైనల్‌లో చూడాలని కప్పు గెలవాలని అన్నారు. అనంతరం ఓపెన్ టు ఆల్ వాలీబాల్ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 36 టీంలు హాజరయ్యాయి. ఈ పోటీల్లో నిలబడి ఫైనల్‌లో గెలుపొందిన సెవెన్‌స్టార్ ఆదిలాబాద్ జట్టుకు పదిహేను వేల నగదుతో పాటు ట్రోఫీని, రెండో స్థానంలో నిలబడిన కామారెడ్డి పోలీసు టీంకు పదివేల రూపాయలతో పాటు కప్పును గెలుపొందిన టీం సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన దృశ్యం

మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని ఆమరణ నిరాహార దీక్ష

కామారెడ్డి టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలో గతంలో వచ్చిన మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలంటూ అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి అనే వ్యక్తి ఆమరణ నిరాహారదీక్ష చేపడుతున్నానని ప్రకటిస్తూ మున్సిపల్ కార్యాలయం ముందు సోమవారం ఆమరణ నిరాహార దీక్షలో కూర్చున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూముల్లోంచి ఇండస్ట్రీయల్ జోన్లు ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అప్పటి వరకు మాస్టర్ ప్లాన్‌ను పూర్తి స్థాయిలో రద్దు చేసే వరకు దీక్ష విరమించనని తెలిపారు.



ధర్మారావుపేట నుంచి లింగంపల్లికి వెళ్లే మట్టి రోడ్డు

మట్టిరోడ్లకు మహర్దశ పట్టేనా?

- అధ్వానస్థితిలో గ్రామాల మధ్య లింకురోడ్లు
- రోడ్లు సరిగా లేక అదనపు ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు

సదాశివనగర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల మధ్య లింకు రోడ్ల అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాయకులు ఎన్నికల సమయంలో వాగ్దానాలు ఇస్తున్నారే తప్ప అమలులో మాత్రం చూపడం లేదని వాపోతున్నారు. మండలంలోని భూంపల్లి నుంచి ఉతనూర్ వరకు, ధర్మారావుపేట్ నుంచి లింగంపల్లి వరకు, అమర్లబండ నుంచి కాళోజీవాడి వరకు, పద్మాజీవావాడి నుంచి తుక్కోజివాడి వరకు ఉన్న లింకు రోడ్లు బాగుపడకపోవడంతో వర్షాకాలం ఇరు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్రంగా అంతరాయం ఏర్పడడమే కాకుండా కొన్ని సందర్భాల్లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గ్రామాలకు మహర్దశ వస్తుందనకుంటూ ఎదురుచూస్తున్న ప్రజల ఆశలు ఆడిశయాలుగానే మిగిలిపోతున్నాయి.

ఇబ్బందులు ఇలా..

భూంపల్లి, ఉత్తనూర్ గ్రామల మధ్య వాగు ప్రవహిస్తుండడంతో వర్షాకాలం భూంపల్లి నుంచి ఉత్తనూర్‌కి వెళ్లాలన్నా ఉత్తనూర్ నుంచి భూంపల్లి వెళ్లాలన్నా తుక్కోజివాడి మీదుగా భూంపల్లికి వెళ్లడం వల్ల 8 కిలో మీటర్ల దూరం పెరుగుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. ధర్మారావుపేట నుంచి లింగంపల్లి వెళ్లాలన్నా వర్షాకాలంలో మోడేగాం మీదుగా లింగంపల్లికి వెళ్లాలంటే 10 కిలో మీటర్ల దూరం పెరిగి రైతులతో పాటు ప్రయాణికులు కూడా అదనపు దూరభారం మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పద్మాజీవాడి ఎక్స్ రోడ్డు నుంచి తుక్కోజీవాడి గ్రామానికి వెళ్లాలన్నా దగ్గి మీదుగా వెళ్లాల్సి రావడంతో 8 కిలో మీటర్ల దూరభారం పెరిగి ఆర్థికంగా కూడా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి లింకు రోడ్లను సత్వరమే పూర్తిచేస్తే ప్రజలతో పాటు రైతులకు అనేక మేలు జరుగుతుందని అంటున్నారు. భూంపల్లి వాగుపైన బ్రిడ్జి లేకపోవడంతో వాగు అవతలి వైపు వ్యవసాయ భూములు ఉన్న రైతులు ఎరువులు వేయడానికి వెళ్లాలంటే తుక్కోజీవాడి మీదుగా ఉత్తనూర్ వైపు వెళ్లి వ్యవసాయ భూములకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ధర్మారావుపేట్ రైతులు లింగంపల్లి శివారులో కొన్ని వ్యవసాయ భూములు కలిగి ఉండడంతో వర్షాకాలం వ్యవసాయ భూములకు ఎరువులు తీసుకెళ్లాలన్నా వాహనంపై వెళ్లాలన్నా రోడ్డు బాగు లేకపోవడంతో మోడేగాం మీదుగా ఎరువు బస్తాలను వేసుకుని లింగంపల్లి మీదుగా తన వ్యవసాయ భూములకు వెళ్లడంతో ఇంధన చార్జీలు భారం కావడం దూర ప్రయాణంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు.



అమర్లబండ్ల నుంచి కాళోజీవాడికి వెళ్లే రోడ్డు





బొమ్మరిల్లు

సంబరాల సంక్రాంతి

- సోమవారం ఘనంగా భోగి పండుగ నిర్వహణ
- ఆకట్టుకునేలా ముగ్గులు.. పతంగుల కోలాహలం
- కొనుగోలుదారులతో మార్కెట్‌లో సందడి
- నేడు సంక్రాంతి పండుగ
- రేపు కనుమ

కామారెడి టౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లోని పట్టణాలు, గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందడి నెలకొంది. మూడు రోజుల ముచ్చటైన పండుగ సంక్రాంతి. మొదటి రోజు భోగి, రెండో రోజు సంక్రాంతి, మూడో రోజు కనుమతో సంబరాలకు ప్రజలు వీడ్కోలు పలుకుతారు. సంక్రాంతి వచ్చిందంటే ఇళ్ల ముందు ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, పతంగుల ఆటలు ఇవే కనిపిస్తుంటాయి. జిల్లాలో ఏ ప్రాంతంలో చూసినా పండుగకు వచ్చిన పిల్లలు, పెద్దలు, పుట్టింటికి వచ్చిన ఆడపిల్లలు, బంధువులతో కళకళలాడుతున్నాయి. ఆడపడుచులకు బ్లౌజులు పెట్టి కట్నాలను సమర్పిస్తారు. సోమవారం భోగి పండుగ సందర్భంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గ పరిధిలో సంబరాలు అంబరాన్నంటాయి. ఇంటిముందు రంగురంగుల ముగ్గులు వేసి మహిళలు అలంకరించారు. ఇంటి గడపపై రేగుపండ్లు, జీడి పండ్లు, పేడ, గరక పోసలు పెట్టి బొట్లతో అలంకరణ చేశారు. నేడు సంక్రాంతి పండుగను జరుపుకోనుండగా రేపు కనుమ పండుగను నిర్వహించుకోనున్నారు.

ఆకట్టుకునేలా ముగ్గులు..

పతంగుల కోలాహలం

పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో చిన్నా పెద్ద తేడా లేకుండా పతంగులు కొనుగోలు చేసి ఎగురవేస్తున్నారు. మైదానాలు, రోడ్లు, భవంతులపై అంతటా పోటీపడి యువకులు చిన్నారులు ఉత్సాహంగా పతంగులను ఎగుర వేస్తున్నారు. వివిధ రంగుల్లో, వివిధ రూపాల్లో పట్టణాలతో పాటు పల్లెల్లో పతంగులు అమ్మడంతో అందరి మదిని దోచేస్తున్నాయి. చారిత్రక కట్టడాలు, కార్టున్లు సినిమాలు, హీరోలు, ప్రధాని మోదీ ముఖచిత్రాలతో అందమైన పతంగులు మార్కెట్‌లోకి వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన పతంగులు, మాంజాల వ్యాపారం జోరుగా సాగుతుంది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, సుభాష్ రోడ్డు, స్టేషన్ రోడ్డు, సిరిసిల్లా రోడ్డు, తిలక్‌రోడ్డు, మాయాబజార్ ప్రాంతాల్లో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. ఏ దుకాణంలో చూసినా చిన్నారులు, యువకుల సందడి కనిపిస్తోంది.

ముగ్గుల పోటీలు

సంక్రాంతి పండుగ అంటేనే మొదట గుర్తుకు వచ్చేది ముగ్గులు. మూడు రోజుల పాటు జరిగే పండుగ ఉత్సవాల్లో ఇంటి ఆడపడుచులు వాకిళ్లను శుభ్రంగా ఊడిచి కళ్లాపు చల్లి అందమైన ముగ్గులు వేసి రంగులు అద్దుతారు. కామారెడ్డి పట్టణంతో పాటు గ్రామాల్లోనూ ఆయా సంస్థలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో పోటా పోటీగా ముగ్గుల పోటీలను నిర్వహిస్తూ బహుమతులను అందజేస్తున్నారు. సోమవారం స్నేహపురి కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల కార్యక్రమాన్ని నిర్వహించారు. చూపరులను ఆకట్టుకునే ముగ్గులు వేసిన వారికి బహుమతులు అందించారు. ఈ ఉత్సవాల్లో కాలనీవాసులు రమేష్, రాజిరెడ్డి, మారుతి, దశరథ్, సుధాకర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

ఇవీ జాగ్రత్తలు

సంక్రాంతి పండుగలో ఎక్కువగా యువకులు పతంగులు ఎగురవేసేందుకు ఆసక్తి చూపుతారు. పండుగ ఆనందం పంచాలే కాని విషాదాన్ని మిగల్చకూడదు. పతంగులు ఎగురవేసే సమయంలో రోడ్లపై ఎగురవేయడం కాని, వాటి కోసం పరుగులు పెట్టడం కాని చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఇళ్లకు దగ్గరగా ఉండే విద్యుత్ తీగల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలి. స్తంభాలు, చెట్లకు వేళాడుతున్న పతంగులు తీయవద్దు.



గాలిపటాలు కొనుగోలు చేస్తున్న యువకులు



నోములు కొనుగోలు మహిళలు



ముగ్గులు వేస్తున్న యువతులు

ఫటా..ఫట్...

భూముల రిజిస్ట్రేషన్ వేగంగా చేస్తున్నాం

● గజానన్ తహసీల్దార్ ఆర్మూర్



ఆంధ్రజ్యోతి: భూములు రిజిస్ట్రేషన్ ఏ విధంగా ఉంది.?

తహసీల్దార్: భూముల రిజిస్ట్రేషన్‌లు ఏ రోజుకు ఆరోజే వెంటనే పూర్తి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రోజుకు ఎన్ని రిజిస్ట్రేషన్‌లు అవుతున్నాయి?

తహసీల్దార్: రోజుకు తక్కువగానే ఒకటి లేదా రెండు రిజిస్ట్రేషన్‌లు వస్తున్నాయి. వెంటనే చేసేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: టెక్నికల్‌గా సమస్యలు ఉన్నాయా?

తహసీల్దార్: గత నాలుగైదు రోజుల నుంచి సర్వార్ స్లోగా ఉంది. అయిన కూడా వీలైనంత త్వరగా రిజిస్ట్రేషన్ చేసేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ స్థలాల కబ్జాపై ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైనట్టు మా నోటీసుకు వస్తే వెంటనే స్వాధీనం చేసుకొని ప్రభుత్వ ఆదీనంలోకి తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: పెర్కిట్ శివారులో ఇది వరకే కొన్ని ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనట్టు ఆరోపణలు వచ్చాయి కద వాటిపై విధమైన చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: ఏదైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైనట్టు మా దృష్టికి వస్తే వెంటనే సర్వేయర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టార్‌తో రిపోర్టు తీసుకొని ప్రభుత్వ ఆదీనంలోకి తీసుకొని పెన్సింగ్ వేసేస్తున్నాం.

● (ఆంధ్రజ్యోతి, ఆర్మూర్)

టీడీపీలో చేరిన కౌన్సిలర్ రమేష్



ఏపీ సీఎం సమక్షంలో టీడీపీలో చేరిన ఎస్ఆర్ రమేష్

ఆర్మూర్‌రూరల్,జనవరి13(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్‌పట్టణంలోని 26వ డివిజన్ కౌన్సిలర్ ఎస్ఆర్.రమేష్ సోమవారం ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎస్ఆర్.రమేష్ గత ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వక పోవడంతో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజారిటీతో కౌన్సిలర్‌గా విజయం సాధించారు. అదే విధంగా ఆర్మూర్ నియో జకవర్గం నుంచి గడ్డం ప్రభాకర్, బిందు, రషీద్, తదితరులు పార్టీలో చేరగా ఏపీ సీఎం చంద్రబాబునాయుడు పార్టీకండువ వేసి పార్టీలోకి ఆహ్వా నించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ కన్వీనర్ దేగాంయాదాగౌడ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పచ్చల నడుకుడ యువ రైతుకు అవార్డు



ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రావణ్‌పటేల్

వేల్పూర్, జనవరి13(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామానికి చెందిన యువ రైతు శ్రావణ్‌పటేల్ ఉత్తమ యువ రైతు అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని జుబ్లీ హిల్స్ రూట్స్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన గ్రాండ్ యువ రైతు అవార్డు ప్రధానం కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదం డ రాం చేతుల మీదుగా శ్రావణ్‌పటేల్ యువ రైతు అవార్డును అం దుకున్నారు. సెవ్ గ్లోబల్ ఫార్మ్స్ నిర్వహించిన స్వా మివివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవ్ పురస్క రించుకొని ఈ అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా యువ రైతు శ్రావణ్ ఎటేల్‌ను స్థానిక గ్రామ రైతులు అభినందించారు.

సాలంపాడ్‌లో పేకాట రాయుళ్ల అరెస్టు

బోధన్‌రూరల్,జనవరి13(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని సాలంపాడ్ గ్రామంలో రహస్య స్థావరంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. పేకాట స్థావరంలో 4,300రూపాయల నగదుతో పాటు సెల్‌ఫోన్‌లు లభించాయన్నారు. పేకాట ఆడిన వారిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ మాట్లాడుతూ పేకాట ఆడిన, నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు పేకాట ఆడి డబ్బులు పొగొట్టుకోవద్దన్నారు. పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

కమ్మర్‌పల్లి,జనవరి 13: (ఆంధ్ర జ్యోతి)బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న ప్రతీ కార్యకరతకు పార్టీ అండగా నిలుస్తుందని వారికి ఏ ఆప దవచ్చినా ఆదుకుంటుందని మాజీమంత్రి బాల్కొండఎమ్మె ల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన మహిళ కార్యకర్త ఆకుల లావణ్య ఇటీ వల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో పార్టీ సభ్యత్వం పొందిన ఆమె భర్త ఆకుల లింగన్నకు రెండు లక్షల ప్రమాదా బీమా చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌శ్రీస్ పార్టీ ఉపాధ్యక్షుడు విద్యాసాయి గంగారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు మహేష్, బాసెట్టి గంగాధర్, ప్రశాంత్, తిరుపతి, దేవేందర్‌లు పాల్గొన్నారు.

కోతుల దాడుల్లో 8 మందికి గాయాలు

కమ్మర్‌పల్లి, జనవరి 13: (ఆంధ్రజ్యోతి) మండంలోని కోనాసమందర్ గ్రామంలో కోతులు హల్‌చల్ చేస్తు భయాందోళనకు గురిజేస్తున్నాయి. గ్రామంలో కేవలం 4 కోతులు మాత్రమే ఉన్నాయని ఈవి వచ్చిపోయేవారిని భయాందోళన గురిచేస్తు రక్కుతున్నాయని గత 5 రోజుల్లో పెద్ద చిన్నా అన్నా తెడాలేకుండా 8 మందిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయని గ్రామస్తు ఆందోలన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకుని కోతులు బెడద నుంచి తమని రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు కోటగిరిలో మకర జ్యోతి దివ్య దర్శనానికి ఏర్పాట్లు

కోటగిరి,జనవరి13(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం మకర జ్యోతి దివ్య దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ట్రస్టు చైర్మన్ పోల విఠల్ రావు గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందు గ్రామంలో అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మకర జ్యోతి దర్శనం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లా అంతటా ఘనంగా భోగీ సంబురాలు



పచ్చలనడ్కుడలో పరిశీలిస్తున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

వేల్పూర్, జనవరి13(ఆంధ్రజ్యోతి): భోగి పండగ సందర్భంగా వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో ఉన్నత పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఆ ద్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను రాష్ట్ర విత్తనా భివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీఒక్క మహిళ తెలంగాణ సాంస్కృతి సంప్రాదాయాలను గౌరవించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మహిళ సం క్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేత లుగా కాంగ్రెస్ మహిళ మండల అధ్యక్షురాలు స్వరూప, ఇంద్రగౌడ్, మాజీ మ హిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు పాకల వాణి దామోదర్‌గౌడ్‌లు వ్యవహారించారు. ఈ పోటీల్లో 45మంది మహిళలు పాల్గొనగా అందులో రాపెల్లి సౌమ్య ప్రథమ, నూనె రేణుక ద్వితీయ, లక్కిడి ప్రవళిక తృతీయస్థానంలో నిలిచిన వారితో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతీఒక్కరికి అన్వేష్‌రెడ్డి బహుమతులను అంద జేశారు. బాల్కొండ నియోజకవర్గంలోని ప్రజలందరికి భోగి, సంక్రాంతి పండగ శుభకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ వైస్‌ప్రెసిడెంట్ టక్కరి గంగాధర్, నాయకులు నెహ్రు, మండలి బోజన్న, అలీం, గంగారెడ్డి, రజనీకాంత్, మోహన్, కృపాల్, చిన్నముత్తెన్న, కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: సంక్రాంతి పండుగను బోధన్ డివిజన్ ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. సోమవారం సంక్రాంతి భోగి సందర్భంగా ఉదయం వేళలో భోగి మంటలు వేడుకల కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని రుద్ర వెంచర్‌తో పాటు వివిధ కాలనీల్లో ప్రజలు గుమిగూడి భోగి మంటల కార్యక్రమాలను నిర్వహిస్తూ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సంక్రాంతి పండుగను ప్రజలందరు తారతామ్యబేదం లేకుండా కలిసి మెలిసి జరుపుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. సంక్రాంతి, భోగి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, ఆర్ఐ వరుణ్, పల్లెంపాటి నవీన్‌లతో పట్టణ ప్రముఖులు తదితరులున్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో సోమవారం భోగీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల వేడుకలలో భాగంగా సోమవారం తెల్లవారుజామున ఇళ్ల ముందు భోగీ మంటలు వేశారు. ఇళ్ల ముందు యువతులు, చిన్నారులు రంగురంగుల ముగ్గులు చేస్తూ సందడి చేశారు. యువకులు, విద్యార్థులు గాలిపటాలు ఎగురవేస్తూ సంబరాలు నిర్వహించారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలో సోమవారం భోగీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ మూడు రోజుల వేడుకలలో భాగంగా సోమవారం తెల్లవారుజామున ఇళ్లముందు భోగీమంటలు వేశారు.ఇళ్ల ముందు యువతులు, చిన్నారులు రంగురంగుల ముగ్గులు వేస్తూ సందడి చేశారు. యువకులు, విద్యార్థులు, పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తూ సంబరాలు జరుపుకున్నారు.

నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో సోమవారం భోగి పండుగను ఘనంగా నిర్వహించారు.మహిళలు తమఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టారు.చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వాదించారు.

రుద్రూర్: కోనేరు చారిటబుల్ ట్రస్ట్ అధినేత, బాన్సువాడ నియోజకవర్గ బీజేపి పార్టీ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ బాన్సువాడ నియో జకవర్గ ప్రజలందరికీ సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

కమ్మర్‌పల్లి: మూడురోజులపాటు జరుపుకునే మకరసంక్రాంతి పర్వదిన వేడుకలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా భోగభాగ్యాలను అందించే భోగీమంటలతో, రంగురంగుల ముత్యాల ముగ్గులతో తెలుగు లోగిళ్ల కలకలలాడాయి. పనికిరాని వస్తులతో భోగిమంటలు వేసి తమకష్టాలు తొలిగిపోవాలని, పాతజ్ఞాపకాలు తొలగిపోయి కొత్త జీవితాలను ప్రసాదించాలని ఇంటిల్లపాది అగ్నిదేవుడిని వేడుకుంటు ప్రత్యేక పూజలు చేశా రు. ఈ సందర్భంగా పిండివంటలతో తెలుగువారి ఇండ్లు ఘుమఘుమలాడాయి. మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం కనుమ పర్వదినాలు జరుపుకోవడానికి సిద్దమవుతున్నారు. ఈ సందర్భంగాచిన్నారులు గాలిపటాలు ఎగురవేయండో బిజిబిజిగా ఉన్నారు.

● పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు

కమ్మర్‌పల్లి మండల పద్మశాలీ సంఘం అద్వర్యంలో సంక్రాంతి పర్వదిన సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక పద్మశాలీ సంఘ భవనంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మండలంలోని వివిద గ్రామాలకు చెందిన పద్మశాలి మహిళలు పాల్గొన్నారు పోటీల్లో ఆకర్శనియంగా మగ్గులు వేసిన వారిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ప్రథమస్థానంలో జక్కాని వీణ (కోనాపూర్), ద్వాతీయస్థానంలో జిందం జ్యోతి (ఉప్లూర్), ముడవస్థానంలో బొడ్డు పావని (నాగాపూర్), నలుగవస్థానంలో జోగ రూప (కమ్మర్‌పల్లి) నిలవగా విజేతలకు మండల సంఘం అధ్యక్షుడు చింత తిరుపతి, ఉపాధ్యక్షుడు రాజుల కృష్ణమురళి, గురడు శంకర్, కోశాధికారి పోతు ధరణి కుమార్, కమ్మర్‌పల్లి శా ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింత హన్మంతు వివిద గ్రామాల పద్మశాలి సంఘాల అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలోని సంక్రాంతి పండగను పురస్కరించుకొని సోమవారం భోగి పండగ సందర్భంగా మహిళలు, చిన్నారులు రంగురంగుల ముగ్గులు వేశారు. సాంప్రదాయ జరుపుకునే ఈ వేడుకలు మహిళలు, చిన్నారులు సంక్రాంతి ముగ్గులు వేసి కుటుంబసభ్యులతో ఆనందంగా జరుపుకుంటారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లిలోని ఆదర్శనగర్‌లో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 35మంది మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. విజేతలకు కాలనీ కమిటీ అధ్యక్షుడు గడ్డం గోపి, ఉపాధ్యక్షుడు మద్దికుంట శ్రావణ్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ కార్యదర్శి అరుణ్, కోశాధికారి బాల్‌రాజ్, డిష్‌ప్రకాష్, సౌడ రవి, భూపేందర్, బార్గవ్ పాల్గొన్నారు.



బోధన్‌లో భోగి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



ఆదర్శనగర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు

వైభవంగా గోదా రంగనాథ కల్యాణ మహోత్సవం

నందిపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నందిపేట మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో సోమవారం శ్రీలక్ష్మి అండాల్ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీగోదా రంగనాథ కల్యాణ మహోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా హా జరైన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, రాష్ట్ర కోఆపరేటీవ్ లిమిటెడ్ చైర్మెన్ మానాల మోహన్ రెడ్డి వేర్వేరుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అతిదులను ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీజేపీ పార్టీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ సభ్యులు పెంట ఇంద్రుడు, మండల పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, ఆర్మూర్ నియోజక వర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్, మాజీ సర్పంచ్ దర్మన్న, నాయకులు వైఎస్ గంగాధర్, గొజ్జి రాజేందర్, వెంకటేష్, దమ్మాయి శ్రీను, బీజేపీ నాయకులు చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.



ఖుద్వాన్‌పూర్‌లో పూజలు చేస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రంగనాథ స్వామి గోదాదేవీల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీ గోదా రంగనాథ స్వాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణంలో భాగంగా విశ్వక్ సేనుని ఆరాధన, గోదాదేవి, రంగనాథ స్వాముల కంకణధారణ, వస్త్ర సమర్పణ, మాంగళ్యధారణ, తలంబ్రాలు అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఆలయ వేద పండితులు దీపక్ పాండేలతో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో వెలిసిన శ్రీరంగనాథ గోదాదేవి రంగనాథుని కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల కొంగుబంగారంగా కొలిచే రంగనాథుని కళ్యాణం కోసం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. కల్యాణ వేదికపై రంగనాథుని ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలతో అలంకరించి స్థానిక పురోహితులు వేదమంత్రాలతో అభిషేకం, అర్చన చేసి అనంతరం కన్నుల పండుగగా వేదమంత్రాల మధ్య కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి మండలంలోని నలుమూలల భక్తులు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ప్రతీ ఏటా సంక్రాంతి సందర్భంగా ఆలయంలో గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీసభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని పలు గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి రంగనాథ కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిం చారు. జక్రాన్‌పల్లి, అర్గుల్, బ్రహ్మణ్‌పల్లి, నారాయణపేట్, తొర్లికొండ గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్ర మంలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

యువకుడి సెల్ఫీ వీడియో వైరల్

● భీమ్‌గల్ ఎస్సై అక్రమంగా కేసు నమోదు చేసి వేధిస్తున్నాడని యువకుడి సెల్ఫీ వీడియో

భీమ్‌గల్‌రూరల్, జనవరి13(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ ప్రొద్బలంతో భీమ్‌గల్ ఎస్సై మహేష్ నాపై అక్రమంగా కేసు నమోదు చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ భయపెడుతున్నాడని ఒక యువకుడు సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. ఇప్పుడు ఆ వీడియో వైరల్‌గా మారింది. పూర్తి వివరాల ప్రకారం మండలంలోని ఛేంగల్ గ్రామానికి చెందిన తక్కురి నికేష్ అనే యువకుడు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్యభర్తల మధ్య గత కొద్ది రోజులుగా మనస్పర్థాలు వచ్చాయి. తనపై కాంగ్రెస్ పార్టీ నాయకుడి అండతో అతని భార్య వరకరట్నం తేవాలని నేను వేధిస్తున్నానని భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్సై మహేష్ అక్రమంగా కేసు నమోదు చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తనకు సరైన న్యాయం చేయాలని లేకుంటే ఆత్మహత్యనే శరణ్యమని ఆ యువకుడు రెండు నిమిషాలు సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో విడుదల చేశాడు. ఆ వీడియో అన్ని వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతుంది. ఆ వీడియోలో పని చేసు కోకుండా పరువు తీస్తున్న భీమ్‌గల్ పోలీసుల కారణంగా రోజుకు ఒక గ్రామంలో తలదాచుకుని తీవ్ర మానసికంగా కృంగిపోతున్నానని, పోలీసులు వేధింపులు అపాలని లేకుంటే ఆత్మహత్య శరణ్యమని ఆ వీడియోలో ఉంది.



బాధితుడు నికేష్

తక్కురి నికేష్ ఇచ్చిన సెల్ఫీ వీడియో తప్పుడు ఆరోపణలు:ఎస్సై

అతని భార్య తక్కురి లతిక అలియాస్ రజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా పోలీస్‌స్టేషన్ పిలువగా రాకుండా తప్పిం చుకొని తిరుగుతూ.. పోలీసులపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. మేము ఎవరికి ప్రొద్బలంతో ఎవరిని హింసించడంలేదు. తక్కురి నికేష్ ఆరోపణలు అబద్దం, బాధితురాలి ఫిర్యాదు మేరకు న్యాయపరమైన చర్యలు తీసుకోని బాధితులకు న్యాయం చేస్తాం.



ఎస్సై మహేష్

వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

భీమ్‌గల్, జనవరి13(ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని కోరుతూ మండల మాదిగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన మాదిగల ధర్మయుద్దం 30ఏళ్ళ పోరాటానికి ముగింపు పలకండి అనే నినాదంతో పట్టణ కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏబీసీడీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

నిమ్స్‌లో చికిత్స కోసం ఎమ్మెల్యే వేముల భరోసా

మెండోర, జనవరి13 (ఆం ధ్రజ్యోతి): మండలంలో కోడి చర్ల గ్రామానికి చెంది న దశ రత్ చికిత్స కోసం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రూ.2ల క్షల ఎల్‌వోసీ బాధితకుటుం బసభ్యులకుఅందజేశారు.ఈ సందర్భంగా బాధితుడు నిమ్స్ ఆసుపత్రిలో చేరడంతో స్థానిక ప్రజాప్రతినిదులు ఎమ్మెల్యే వేముల దృష్టికి తీసుకువెళ్లగా ఎమ్మెల్యే స్పందించి మెరుగైన చికిత్స కోసం రూ.2 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించి ఎల్‌వోసీ కాపిని వారి కుటుంబ స భ్యులకు అందజేవారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ నిరుపేదలమైన మాకు వైద్య చికిత్స కోసం రూ.2 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి జీవితంతం రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, మెండోర వైస్‌ఎంపీపీ రవీంధర్‌గౌడ్, కోడిచర్ల గ్రా మశాఖ అధ్యక్షుడు దేవేంధర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గంగారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రెండు ముక్కలైన శరీరం

ముప్కాల్,జనవరి13(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం చిట్టాపూర్, శ్రీరాంపూర్ హైవేపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వెనుక నుంచి వచ్చిన కంటైనర్ ఢీకొని పది మీటర్ల దూరం ఈడ్చుకెళ్ళడంతో మృతదేహం నుజ్జునుజ్జుతో శరీరం రెండు ముక్కలైంది. ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ఒంగోలు జిల్లా దర్మారం గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాస్(32) నిర్మల్ జిల్లా సోన్ మండలం బొప్పారం గ్రామంలో పదేళ్లుగా మేస్త్రీ పని చేస్తూ కుటుంబంతో స్థిరపడ్డారు. సోమవారం సాయంత్రం బొప్పారం నుంచి తన బంధువును పెర్కిట్‌లో దింపి ఇంటికి వెళ్తుండగా ఈ క్రమంలో నేషనల్ హైవే 44 చిట్టాపూర్, శ్రీరాంపూర్ గ్రామాల మధ్య కంటైనర్ వెనుక నుంచి ఢీకొని కొద్దిదూరం ఈడ్చుకెళ్లింది. దీంతో హైవేపై కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవల మృతుడి భార్య మృతి చెందినట్టు తెలిసింది. మృతుడికి ఇద్దరు కూతుళ్ళ, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రులు మరణించడంతో ముగ్గురులు పిల్లలు అనాథలయ్యారు.



బత్తుల శ్రీనివాస్(ఫైల్)

తాగునీటి సమస్య పరిష్కరించాలని రాస్తారోకో



కోటగిరిలో రాస్తారోకో నిర్వహిస్తున్న మహిళలు

కోటగిరి,జనవరి13(ఆంధ్రజ్యోతి):కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం టాక్లీ గ్రామస్తులు తాగునీటి సమస్య పరిష్కరించాలని రాస్తారోకో, ధర్నా చేపట్టారు. పొతంగల్ మండలంలోని టాక్లీ గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు తమ కాలనీకి గత కొన్ని రోజులుగా మంచినీటి సరపరా కావడం లేదన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు రాస్తారోకో విరమించారు.

సిద్దులగుట్టపై ఘనంగా పల్లకీసేవ

పెర్కిట్, జనవరి13(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పల్లకిసేవ ఘనంగా నిర్వహించారు. భోగి పండగ సందర్భంగా భక్తులు సిద్దులగుట్టపైకి అధిక సంఖ్యలో విచ్చేసి సిద్దేశ్వరునికి దర్శించుకున్నారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకిసేవను ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆర్మూర్ భజన మండల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తిగీతలు పాడుతూ నృత్యాలు చేశారు.రాజస్థాన్ స్వీట్‌హోం, భజంగ్ టైల్స్, ప్రొప్రైటర్ బాన్సిలాల్ అనితదేవి దంపతులు సిద్దులగుట్టపై విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలోఆలయ కమిటీ స భ్యులు బి.సుమన్ పిసి.గంగారెడ్డి, కొడిగెలమల్లయ్య, బోండ్లఆనంద్, రవి, సంధ్య, చెందేశీ శ్రీనివాస్, బటు శంకర్, ప్రశాంత్‌గౌడ్, హజరి సతీష్, అలిశెట్టి నరేష్, రామాగౌడ్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

పడిగెలలో వాహనాల తనిఖీ

వేల్పూర్, జనవరి13(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం 63వ జాతీయరహదారి పడిగెల క్రాస్‌రోడ్డు వద్ద వేల్పూర్ ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ నిర్వహించారు. హెల్మెట్‌లు ధరించని వారి జరిమానాలు విధిస్తూ వాహనాలకు సంబంధించిన ధృవపత్రాలు పరిశీలించారు. డ్రైవింగ్‌లైసెన్స్ వాహనపత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ప్రతీఒక్కరు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని, వాహనాలకు సంబంధించిన ధృవపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌లు వెంట ఉంచుకోవాలని ఎస్సై సంజీవ్ సూచించారు.

ఉరేసుకొని ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, జనవరి13(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో చెట్టుకు ఊరివేసుకొని సయ్యద్ ఫక్రు(40) అనే వ్యక్తి మృతి చెందాడని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. వివరాల ప్ర కారం నిజామాబాద్‌లోని హబీబ్‌నగర్‌లో నివాసముంటున్న సయ్యద్ ఫక్రు పెయింటర్‌గా పనులు చేసుకుంటూ మద్యానికి బానిసయ్యాడని, అప్పుడప్పు డు ఆర్మూర్‌లోని తనతల్లిగారి ఇంటికి వచ్చివెళ్లేవాడని, అలాగే, 15రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల వెతకగా ఆది వారం పెర్కిట్ శివారులో ఊరివేసుకొని మృతి చెందినట్టు ఆయన తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

రుద్రూర్‌లో చోరీ

● రెండు గ్రాముల బంగారు కమ్మలు, ముప్పై తులాల వెండి పట్టీలు అపహరణ

రుద్రూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండల కేంద్రంలోని జవహర్ నగర్ కాలనీలో మసీద్ పక్కన సఫీయా బేగం అను ఆమె ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం..రుద్రూర్ గ్రామానికి చెందిన సఫీయా బేగం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంటాక్ట్ టీచర్‌గా విధులు నిర్వహిస్తుందని, సంక్రాంతి సెలవులు ఉండడంతో శనివారం ఉదయం 10గంటలకు తన కూతురుతో హైదారాబాద్‌లోని వాళ్ల అన్న ఇంటికి వెళ్లారన్నారు. బాధితురాలు సఫీయా ఇంట్లో పనిచేసే పోతురాజు లింగయ్య సఫీయాకు ఫోన్‌లో సమాచారం అందించారని, సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి, తలుపులు తెరిచి ఉండడంతో, ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉందని, బీరువాలో రెండు గ్రాముల బంగారు రింగులు, రెండు గ్రాముల బంగారు కమ్మలు, ముప్పై తులాల వెండి పట్టీలు రెండు జతలు కనిపించలేవని, దొంగలు పడ్డారని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, రుద్రూర్ ఎస్సై సాయన్న తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం క్లూజ్ టీం సహాయంతో వేలిముద్రలు సేకరించామన్నారు. బాధితురాలు సఫీయా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై సాయన్న వెల్లడించారు.



చోరీకి గురైన బీరువా

విద్యార్థి అదృశ్యం

కోటగిరి,జనవరి13(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రానికి చెందిన వన్నె నాగరాజు అనే విద్యార్థి రెండు రోజుల క్రితం అదృశ్యం అయినట్లు కోటగిరి ఎస్ఐ సందీప్ తెలిపారు. శనివారం పాఠశాలకు వెళ్తానని చెప్పి వెళ్లిన నాగరాజు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ విషయమై కోటగిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.



నాగరాజు(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోటగిరి,జనవరి13(ఆంధ్రజ్యోతి): మండలం జల్లపల్లి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదవరావు(35)అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలూకా సాంగ్లీ గ్రామానికి చెందిన యాదవరావు తన భార్య పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై బీర్కూర్ వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదవ రావుకు తీవ్ర గాయాలయ్యాయి. భార్య పిల్లలకు స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యాదవరావు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెర్కిట్, జనవరి13(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో అడ్మిషన్‌లు పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఏ.శ్యామ్ తెలిపారు. 2025-26 విద్యసంవత్సరానికి గాను 6వ తరగతిలో 100సీట్లకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీలను బట్టి వాటి కొరకు ఫిబ్రవరి 28వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ విద్యార్థులకు రూ.125లు, ఓసి విద్యార్థులకు రూ.200 ఆన్‌లైన్ ఫీజు ఉంటుందని, ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్‌ను ఏప్రిల్ 3వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ఏప్రిల్ 13వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇతర వివరాలకు ప్రిన్సిపాల్ 9949291909 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

సిద్దులగుట్ట ఆలయాల్లో చోరీ

ఆర్మూర్‌టౌన్, జనవరి13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దులగుట్టపై గల శివాలయం, అయ్యప్ప ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయాల్లో హుండిలను పగులగొట్టి సుమారు రూ.15వేల వరకు నగదును ఎత్తుకెళ్లినట్టు తెలిసింది. సిద్దులగుట్ట మేనేజర్ ఫిర్యాదు మేరకు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూర్యుడి మకర సంక్రమణే సంక్రాంతి

● ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం
● సంక్రాంతి పురుషుడికి ముగ్గులతో స్వాగతం
● నోముల ప్రత్యేకత
● గాలిపటాలతో వేడుకలు


సకినాలు చేస్తున్న మహిళ


ముగ్గువేస్తున్న చిన్నారి




గంగిరెద్దుకు పూజలు చేస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే పుణ్యమైన రోజును మకర సంక్రాంతి పర్వదినాన్ని జరుపుకుంటారు. ప్రతీ యేట పుశ్యమాసంలో సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే రోజున పుణ్య ప్రదంగా భావిస్తారు. సంవత్సరంలో రెండు భాగాలలో మొదటి భాగంగా ఉత్తరాయనంగా భావిస్తారు. తొలి ఏకాదశి పర్వదినం నుంచి రెండవ భాగమైన దక్షణాయనం ప్రారంభం అవుతుంది. సంక్రాంతి పర్వదినంతో దక్షణాయనం పూర్తయి ఉత్తరాయన పుణ్యకాలం సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే రోజు నుంచి ప్రారంభమవుతుంది. ఉత్తరాయన పుణ్యకాలంలో సకల దేవతలు భక్తులకు దర్శనమివ్వడానికి భూలోకానికి వస్తాడని పురాణాలు తెలుపుతున్నాయి. ఈరోజున సకల దేవతలను భూలోక వాసులు ఘనంగా స్వాగతం పలుకుతూ ఉత్తరాయన పుణ్య కాల పూజలు నిర్వహిస్తారు. భూలోక వాసులకు సంవత్సరం దేవతలకు ఒక్కరోజుతో సమానమని శాస్త్రం చెబుతుంది. దక్షణాయనం పుణ్య కాలంలో దేవతలు యోగ నిద్రలో ఉండి ఉత్తరాయన పుణ్యకాలంలో దేవతలు భక్తులకు దర్శనమిస్తారు. ఉత్తరాయన పుణ్యకాలం మకర సంక్రాంతి పర్వదినం నుంచి ప్రారంభమై కర్కాటక రాశిలోకి సూర్యుడు ప్రవేశించే దక్షణయానం వరకు దేవతలకు పగలుగా భావిస్తారు. దక్షణయాన కాలంలో మానసికమైన అర్చన, ధ్యానం, యోగా ఉత్తరాయన పుణ్య కాలంలో దేవతల అనుగ్రహం సంపూర్ణంగా ఉంటుందని భక్తులు విశ్వసిస్తారు. దక్షణ యాన కాలంలో పండుగలు, పర్వదినాలు విశేషంగా దేవతలను అర్పి స్తారు. ఉత్తరాయన పుణ్యకాలంలో భగవంతుని అనుగ్రహంతో శుభ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సంక్రాంతి పురుషుడికి ముగ్గులతో స్వాగతం

సంక్రాంతి పర్వదినం అనగానే ఇంటి ముందట ముగ్గులతో మహిళలు అలంకరిస్తారు. సంక్రాంతి పురుషుడు భూలోకానికి సకల దేవతలతో ప్రతీ ఇంటి గుమ్మం ముందుకు వస్తాడని శాస్త్రం చెబుతుంది. సకల దేవతలకు ఘనస్వాగతంలా ఇంటి ముందర ముగ్గులు, తోరణాలతో తీర్చిదిద్దుతారు. ముగ్గులలో గొబ్బెమ్మలు, ఎండు మిరపకాయలు పెట్టి సంక్రాంతి పురుషుడికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ గా వస్తుంది. ఏ ఇంటి ముందైతే ముగ్గులతో దేవతలకు ఆరాధన చేస్తారో ఆ ఇంటికి సంవత్సరం పొడవున సకల శుభాలు చేకూరుతాయని విశ్వసిస్తారు.

గంగిరెద్దులకు ప్రత్యేక పూజలు

పండుగలో గంగిరెద్దులను పూజించడం రైతన్నలు ప్రత్యేకంగా భావిస్తారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యంతో సిరిసంపదలు అందించిన గంగి రెద్దులు రబీ సీజన్‌లో పాడిపంటలతో చల్లగా చూడమని వేడుకుంటూ గంగిరెద్దులను పూజిస్తారు. సంక్రాంతి పర్వదినంలో ప్రతీ ఇంటి ముందు గంగిరెద్దులు ఆడించేవారు గంగిరెద్దులను తీసుకువచ్చి ఆడిస్తారు.

నోముల ప్రత్యేకత

మకర సంక్రాంతి పర్వదినాన నోములను నోచుకోవడం హిందూ సాంప్రదాయంలో ప్రత్యేకత భావిస్తారు. ఈ సంక్రాంతి పండుగ రోజున ఉదయాన్నే దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి 13 సంఖ్యతో వివిధ రకాల వస్తువులను నోములుగా నోచుకుంటారు. నోములను పూజించి మొదటి నోమును లక్ష్మీనారాయణుడికి అందజేసి మిగతా నోములను ముత్తయిదువలకు అందజేస్తారు. సంక్రాంతికి నోచుకున్న నోములను ముత్తయిదువలకు అందజేయడం ద్వారా పది కాలాల పాటు సౌభాగ్యంతో ఉంటారని మహిళలు భావిస్తారు. ఏటికియేడు సంక్రాంతి రోజులలో నోములను నోచుకునే వారి సంఖ్య పెరుగుతుంది.

నువ్వులు, బెల్లంతో పిండివంటలు

మకర సంక్రాంతి పర్వదినాన నువ్వులు, బెల్లంతో పిండివంటలను తయారు చేస్తారు. రుతు సంబంధమైన వ్యాధులు దరికి రాకుండా నువ్వులు, బెల్లంతో తయారు చేసిన పిండివంటలు ఆరోగ్యాన్ని ఇస్తాయని శాస్త్రం చెబుతుంది. దీంతో ఈరోజు తప్పనిసరిగా ప్రతీ వంటలో నువ్వులు ఉండే విధంగా చూసుకుంటారు. నువ్వులతో స్నానాది కార్యక్రమాలు చేసే విధంగా పండుగలో ప్రత్యేకంగా చూస్తారు.

గాలిపటాలతో వేడుకలు

సంక్రాంతి పండుగలో గాలిపటాలతో యువత సందడి చేస్తారు. రుతు సంబంధమైన వాతావరణానికి అనుగుణంగా గాలిపటాలను ఈ రోజున ఎగరవేయడం ఆనవాయితీగా వస్తుంది. గాలిపటాలను ఎగరవేస్తూ స్నేహితులతో వేడుకలను జరుపుకోవడం సంక్రాంతిలో ప్రత్యేకతగా భావిస్తారు. పెద్దవారు చిన్నవారికి నువ్వులు, బెల్లం తిను నూరేళ్ల బతుకు అని నువ్వుల బెల్లాన్ని ఇస్తూ ఆశీర్వదిస్తారు.

గో ఆరాధనకు కనుమ పండుగ

భోగభాగ్యాలను అందించే భోగి పండుగతో ప్రారంభమయ్యే సంక్రాంతి పర్వదినాలు కనుమ పండుగతో ముగుస్తాయి. మూడవ రోజైన కనుమ పర్వదినాన నోములకు ప్రత్యేక పూజలు నిర్వహించి ముత్తయి దువలకు అందజేస్తారు. నోములతో పాటు గో దేవతకు పూజించడం కనుమ పండుగలో ప్రత్యేకంగా భావిస్తారు. బొమ్మల కొలువులో ఏర్పాటు చేసిన లక్ష్మీనారాయణుడు, బొమ్మలను ప్రత్యేకంగా పూజించి కనుమ పండుగ రోజున అమ్మవారికి వాయినాలను అందిస్తారు.

ముగ్గులతో ఆకట్టుకుంటున్న మహిళలు

సంక్రాంతి పండుగ అనగానే మహిళలు ఇంటి ముందర ముగ్గులు వేసి ముస్తాబు చేస్తారు. పండుగ మూడు రోజుల పాటు చుక్కల ముగ్గులతో పాటు సంక్రాంతి పర్వదినం ఉట్టిపడేలా ముగ్గులు వేస్తూ ప్రత్యేకత చాటుకుంటారు. భోగి రోజు ప్రారంభమైన ముగ్గులు కనుమ వరకు కొనసాగుతాయి.


ధర్మారంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా భోగి పండుగ

డిచ్‌పల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం జరిగిన భోగి పండగ పురష్కరించుకొని ఉదయం భోగి మంటలను వేశారు. ధర్మారం(బి) వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం వేద బ్రాహ్మణులు నిర్వహించారు. ఏడో బెటాలియన్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం వేకువజామున భోగి మంటలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ దంపతులు, మహిళలు పాల్గొన్నారు. ధర్మారం వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా భోగి పండుగ పౌర్ణమి సందర్భంగా గోదాదేవి కల్యాణం ఆలయ అర్చకులు రాహుల్ త్రిపాఠి, నిర్వహించారు. పట్టు వస్త్రాలు తలంబ్రాలు ఆలయ ధర్మకర్త రావుల బ్రహ్మానందం దంపతులు అందజేశారు. కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగార్జున, ఆంజనేయులు, సుబ్బారావు, హన్మాండ్లు, శ్రీనివాస రావు, లక్ష్మీనారాయణ, బుజ్జి పాల్గొన్నారు.

ధర్మారం(బి)లో కోళ్ల పందెలు

మండలంలోని ధర్మారం(బి) గ్రామ శివారులో సంక్రాంతి పర్వ దినం సందర్భంగా మందస్తుగా భోగి రోజు కోళ్ల పందెలు జోరుగా సా గాయి. కొందరు యువకులు కోళ్ల పందెల్లో డబ్బులు పందెం కాసారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి యువకులు, సెటిలర్స్‌లు తరలివచ్చి ఈ పందెంలో పాల్గొన్నారు.


బెటాలియన్‌లో గోదా దేవి కల్యాణం


నర్సింగ్‌పల్లిలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం


● భక్తుల గోద నామస్మరణలతో మార్మోగిన ఆలయాలు
● ఘనంగా భోగి కల్యాణోత్సవాలు

నిజామాబాద్ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గోదా రంగనాథ గోవిందా గోవిందా.. అంటూ భక్తుల గోవింద నామస్మరణలు ఒకవైపు, వేద మంత్రోచ్చరణలు మరోవైపు సాగుతుండగా గోదా రంగనాథుల కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై భోగి పండుగ పర్వదినాన గోదా రంగనాథుల వివాహం కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీవైష్ణవ ఆలయాల్లో గత నెలరోజులుగా గోదాదేవి అందించిన తిరుప్పావై పాటలను పాడి భోగి పండుగ పర్వదినాన రోజున గోదాదేవి శ్రీరంగనాథున్ని వివాహం ఆడింది. స్వామి ఆరాధిస్తూ భోగి పండుగ రోజున అమ్మవారు స్వామిని పెళ్లాడినట్లు శాస్త్రం చెబుతుంది. వేద పండితులు వేదమంత్రాలు పఠించగా అర్చకులు కళ్యాణంలోని ముఖ్య ఘట్టాలను పాదప్రక్షాళనం, మధుపర్కం, యజ్ఞోపవిత ధారణ, కన్యాదానం, జీల్లకర్ర బెల్లం, మాంగళ్యసూత్రదారణ, తలంబ్రాలు, బ్రహ్మముడి తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జెండా బాలాజీ మందిరంలో నిర్వహించిన కల్యాణ వేడుకల్లో పండితులు సారంగపాని ప్రవీణ్ ఆచార్య వేదమంత్రాలు పఠించగా అర్చకులు నాగరాజ చార్య, ఆనంద్‌శర్మ, రాజు ఆచార్య, దిలీప్‌శర్మలు కల్యాణ వేడుకలను నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వేణు దంపతులు కన్యాదానం నిర్వహించారు. అదే విధంగా సుభాష్‌నగర్ రామాలయంలో జరిగిన వేడుకల్లో పండితులు సముద్రాల శ్రీధరాచార్య, కృష్ణమాచార్య, వేణుగోపాలచార్య వేదమంత్రాలు పఠించగా ఆలయ అర్చకులు తులసీమురళీధరచార్య, రాఘవచార్యలు వేడుకను నిర్వహించారు. చక్రంగుడి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన గోదా రంగ నాథుని కల్యాణంలో పండితులు సేనాపతి కుమారాచార్య వేదమంత్రాలు పఠించగా ఆలయ అర్చకులు నాగరాజ చార్య, హయ గ్రీవాచార్య, రఘురాం ఆచార్య, నర్సింహామూర్తి కల్యాణ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సముద్రాల రామాచార్య, సేనాపతి శ్రీనివాస చార్య, వైభవ్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్‌పల్లి దేవాలయంలో..

మోపాల్ మండలం పరిధిలోని నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల ఆలయంలో గోదా రంగనాథుని కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై గోదా రంగనాథుని ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయ అర్చకులు రోహిత్ ఆచార్య, విజయ్ ఆచార్య కల్యాణ వేడుకలను నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త నర్సింహా రెడ్డి దంపతులు కన్యాదానం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సారెడ్డి, రమేష్, సుధాకర్, మురళి, సాయిలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చెక్కుచెదరని 90 ఏళ్ల నాటి కట్టడం


90 ఏళ్ల కింద నిర్మించిన నిజాంసాగర్ వీఐపీ అతిథి గృహం

నిజాంసాగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువన ఉన్న ఈ అతిథి గృహం మీకు తెలుసా ఈ అతిథి గృహాన్ని 1921 సంవత్సరంలో నైజాం ప్రభుత్వం హయాంలో నిజాంసాగర్ నిర్మాణానికి ముందే ఈ అతిథి గృహాన్ని నిర్మాణం చేపట్టారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ దశలో ఇంజనీర్ అధికారుల బృందం ఈ అతిథి గృహంలోనే సేద తీరి బస చేసేవారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ అనంతరం అప్పటి నైజాం ప్రభుత్వం 1931లో జాతికి అంకితం చేశారు. నైజాం కాలంలో నిర్మించిన ఈ అతిథి గృహం ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉండటం విశేషం.

ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత



ఆర్మూర్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్


రెడ్ సిగ్నల్స్ పడ్డా ఆపకుండా వెళ్తున్న వాహనాలు


యాడ్‌లకు పరిమితమైన ట్రాఫిక్ ఐలాండ్

ఆర్మూర్‌టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో ఆర్మూర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తూతూ మంత్రంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి సిబ్బంది నియమకాన్ని మరిచిపోయారు. పట్టణంలోని హస్నాబాద్ గల్లీలో గతంలో ఉన్న రూరల్ పోలీస్‌స్టేషన్ బాల్కొండకు తరలి వెళ్లడంతో అందులో ట్రాఫిక్ పోలీసులు ఉంటున్నారు. 2023మే నెలలో ఒక ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లతో ట్రాఫిక్ పోలీసులు నియమకం చేశారు. కొన్ని నెలల తర్వాత ఉద్యోగ బదిలీలు జరుగాక, తదానంతరం ఒక సంవత్సరానికి ట్రాఫిక్ సీఐ, ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు ఒక హోంగార్డును నియమించి పాతరూరల్ పోలీస్‌స్టేషన్‌ను కేటాయించారు. కానీ అందులో పూర్తి ఉద్యోగులను భర్తీ చేయలేదు. వీరు ట్రాఫిక్‌ను క్రమబద్దీకరిస్తున్నారే తప్ప ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి జరిమానా వేయడానికి కనీస ట్యాప్‌లు లేకపోవడంతో వారి సెల్‌ఫోన్‌లో బందించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులకు కేటాయించాల్సిన వాహనాలు సైతం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించిన అనంతరం సేద తీరడానికే స్టేషన్ ఉందని ప్రజలు భావిస్తున్నారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి మామిడిపల్లి చౌరస్తా, పెర్కిట్ చౌరస్తా వరకు నిత్యం ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్‌తో సతమతమవుతుంటే దానికి తోడు అప్పుడప్పుడు ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయకపోవడం కొసమెరుపు. ఇలా నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుండగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది నియమకానికి ఉన్నతాధికారులు గాని ప్రభుత్వం గాని చొరవ చూపడం లేదని వాహనదారులు నిస్పృహను వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్ల కిందట ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఐలాండ్‌లు పలు షాప్‌లకు యాడ్ బోర్డులుగా మిగిలిపోయాయి.

తప్పని ట్రాఫిక్ ఇబ్బంది

ఆర్మూర్ పట్టణంలో ట్రాఫిక్ సిబ్బంది కొరతతో ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. పలువురు వాహనదారులు సిగ్నల్స్ పడినప్పటికీ అవేమి పట్టించుకోకుండా వెళ్తున్నారు. అంతేగాకుండా రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రోడ్లపై కార్లను, ఆటోలను అడ్డగోలుగా పార్క్‌చేసి వెళ్తుండడంతో వచ్చేపోయే వాహనదారులకు అసౌకర్యంగా మారింది. దీనికి తోడు చిరు వ్యాపారులు, తోపుడు బండ్లవారు సైతం రోడ్లపైనే తిష్టవేయడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ పడిన వాహనదారులు ఆపకుండా వెళ్తున్నారు. దీంతో ప్రమాదాలు సంభవించి అవకాశాలు ఉన్నాయి. వీటన్నింటిని నియంత్రించాలంటే ట్రాఫిక్ పోలీసులను పెంచాల్సి ఉంది. అరకొర సిబ్బందితో ట్రాఫిక్ నియంత్రణ సాధ్యం కాకపోవడంతో పాటు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఆర్మూర్ పట్టణంపై దృష్టి సారించి ట్రాఫిక్ పోలీసులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.


ఆర్మూర్‌లో అడ్డగోలుగా వాహనాల పార్కింగ్

ట్రాఫిక్‌ను అదుపు చేయాలి

● సంగం అనిల్, వాహనదారుడు



మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్‌ను అదుపు చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి జరిమానాలు విధించాలి.

దేవుడిచ్చిన శక్తి మేరకు గ్రామాలను అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మెండోర, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నాకు దేవుడు ఇచ్చిన శక్తి మేరకు గ్రామాలకు అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రూ.40లక్షలతో నూతనంగా నిర్మించిన కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మం డపం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్యాణ మండపం ప్రారంభోత్సవానికి ఆహ్వానించిన గ్రామస్థులకు గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రూ.40లక్షలతో నూతన కళ్యాణ మండపం నిర్మించుకున్నామని వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మండల కేంద్రంలో కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేసుకున్నామని ఇక ముందు కూడా నా శక్తిమేర గ్రామానికి పనులు చేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ సంక్రాంతి మీ కుటుంబాల్లో వెలుగులు నింపాలని మీ అందరికి విజయాలు చేకూర్చాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్, తలారి గంగాధర్, నవీన్‌గౌడ్, మచ్చర్ల రాజారెడ్డి, సామ గంగారెడ్డి, రవి గౌడ్, ఏలేటి శ్రీనివాస్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోదారంగ నాయక కల్యాణం

శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు గోదారంగనాయక కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గోదాదేవి కల్యాణం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు మాట్లాడుతూ విష్ణు కూతురు గోదాదేవి తమిళనాడులో శ్రీవెల్లపుత్రులో జన్మించింది. ఈమె తండ్రి శ్రీరంగనాథుడు(విష్ణు) ప్రతీరోజు తులసీ మాలలు అల్లి అమ్మే వారు. గోదాదేవి చిన్నపటి నుంచి రంగనాయకుడిని వివా హం చేసుకుందామని పదేపదే కోరుకునేది ఉదయం పూల వేసినట్టువంటి తులసీ మాటలను తెల్లవారిన తర్వాత ఆ మాలలను ఆమె మెడలో వేసుకునేది. నేడు ఈ భగ వంతున్ని తప్ప ఎవరిని కూడా వివాహం చేసుకొను అని ప్రతీ నిత్యం రోజు ఒక్క పశురం చొప్పున 30 రోజులు పశురాలు చదివి రంగనాథుడిని మెప్పించి అప్పుడు ఆమె శ్రీ రంగనాథుడు వచ్చి ఆమెను వివాహం చేసుకుంటాడు. ఈ మాసమును మార్గశిర మాసం అంటారు. దీన్ని పురస్క రించుకొని గోదాదేవి కల్యాణం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


మెండోర ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

యథేచ్ఛగా హరితహారం చెట్ల నరికివేత


ఎడపల్లి శివాలయం దగ్గర చెట్లను తొలగించిన దృశ్యం

ఎడపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా చేయాలనే ఉదేశంతో గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి చెట్లను నాటించింది. అవి గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలతో పాటు ప్రధాన రహదారి వెంట చెట్లను నాటించారు. అందులో కొన్ని చనిపోగా రోడ్ల ప్రక్కన ఉన్న చెట్లు మాత్రం ఏపుగా పెరిగాయి. అయితే ఇవి నాటే సమయంలో ఆలోచించకుండా విద్యుత్ తీగల కింద నాటడంతో ప్రతీ సంవత్సరం విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయనే ఉద్దేశంతో వాటిని విద్యుత్ అధికారులు సగానికి నరికేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రోడ్డు పక్కన వారు కొన్న భూములకు చెట్లు అడ్డుగా ఉన్నాయని వాటిని కూకటి వేళ్లతో పెకిలించేస్తున్నారు. ఈ మధ్యనే ఎడపల్లి మండలంలోని దూపల్లి గేటు దగ్గర ఓ రియల్ వ్యాపారి తాను చేసిన అక్రమ వెంచర్‌కు అడ్డుగా ఉన్నాయని చెట్లను పూర్తిగా తొలగించాడు. తాజాగా ఆదివారం ఎడపల్లి మండల కేంద్రంలోని శివాలయం వద్ద బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్లను బోధన్‌కు చెందిన ఓ రియల్ వ్యాపారి వేళ్లతో సహా తొలగించేశాడు. చెట్లను కాపాడాల్సిన రెవెన్యూ, ఫారెస్టు అధికారులు పట్టించుకోక పోవడంతోనే లక్షలు వెచ్చించి నాటిన చెట్లను రియల్టర్‌లు నరికి వేస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. రెండు చోట్ల రియల్టర్‌లు తొలగించిన చెట్లు ఫారెస్టు అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా ఫారెస్టు అధికారుల పర్యవేక్షణలో నాటి కాపాడిన చెట్లు కావడం కొసమెరుపు.

మార్కెట్‌లో సంక్రాంతి సందడి



కుండలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



కొనుగోలు చేస్తున్న ప్రజలు

మద్నూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మార్కెట్లో సంక్రాంతి పండుగ సందడి నెలకొంది. సంక్రాంతి పండుగ ఏర్పాట్లలో రైతులు వారి కుటుంబీకులు బిజీబిజీగా ఉన్నారు. పండుగకు కావాల్సిన వస్తువుల మార్కెట్ సందడిగా కనిపించింది. సోమవారం మద్నూర్ మార్కెట్లో రైతులు తమకు కావలసిన వస్తువులు కొనుగోలులో నిమగ్నమయ్యారు. సంక్రాంతి పండుగ ఖరీఫ్ వేసిన అన్ని రకాల పంటలు చేతికి వచ్చాక రైతులు జరుపుకునే తొలి పండుగ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దంపట్టే పండుగ సంక్రాంతి పండుగ. ఈ పండుగను రైతులు, వైభవంగా జరుపుకుంటారు. జుక్కల్ నియోజకవర్గంలో మహారాష్ట్ర, కర్నాటక సాంప్రదాయాలతో తెలంగాణ సంస్కృతి ప్రకారం లక్ష్మీ పూజలు నిర్వహిస్తారు. రైతు కుటుంబ సభ్యులతోపాటు బంధు మిత్రులతో కలిసి జొన్న చేలకు వెళ్లి పూజలు నిర్వహించి ఇంటి వంటలు ఆరగిస్తారు. సంక్రాంతి రోజు తెల్లవారు జామునుంచి ప్రతీ ఇంటి ముందర మహిళలు రంగు రంగుల ముగ్గులు వేస్తారు. బంధువులతో కొత్త కళ కనిపిస్తుంది. యువకులు పతంగుల ఆటల్లో నిమగ్నమవుతారు. ఈ ప్రాంతంలో రైతులు తమ జొన్న చేలకు వెళ్లి జొన్న కర్రలకు చీర చుట్టి గుడిని ఏర్పాటు చేసి అందులో దీపం వెలిగిస్తారు. తర్వాత పీడకపై మట్టితో తయారైన కుండలో పాలు పోసి పొంగించి లక్ష్మీదేవికి పూజలు నిర్వహిస్తారు. జొన్న కర్రలతో తయారుచేసిన గుడిలో దీపం వెలిగించి ఆ దీపాన్ని లక్ష్మీదేవిగా పూజిస్తారు. పూజలు అయిన తర్వాత కుటుంబ సభ్యులు బంధు మిత్రులతో కలిసి వన భోజనం చేస్తారు. ఈ భోజనములో ప్రత్యేకంగా బెల్లం పలుకులతో నువ్వులతో చేసిన సీట్లు అన్ని రకాల కూరగాయలతో తయా రుచేసిన బజ్జి కర్రీగా పిలువబడి కర్రీతో భోజనాలు చేస్తారు. అందరి భోజనాలు పూర్తి చేసుకుని జొన్న చేతులను ఉంచిన దీపాన్ని ఇంటికి తీసుకెళ్లి దేవుని గదిలో ఉంచి పూజల నిర్వహిస్తారు. సాయంత్రం యువకులు పిల్లలు పతంగులు ఎగుర వేయడంలో నిమగ్నం కాగా మహిళలు నోములను నోచుకుంటారు. చక్కెరతో తయారైన నోములను ఇంటింటికి వెళ్లి ఇచ్చి పుచ్చుకుంటారు. తర్వాత నువ్వులు బెల్లం ఒకరినొకరు ఇచ్చి పుచ్చుకొని పండుగ శుభా కాంక్షలు చెప్పుకుంటారు. పండుగకు కావలసిన కూరగాయలు మండల కేంద్రంలో కొనుగోలు చేయడంతో మద్నూర్ మార్కెట్ సందడి నెలకొంది.



రంగురంగుల ముగ్గులు కొనుగోలు చేస్తున్న యువతులు

జంగంపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జంగంపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్న దృశ్యం

భిక్కనూరు, జనవరి 13(ఆంధ్ర జ్యోతి): మండలంలోని జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1997-98 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, వ్యాపార నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన, గ్రామంలో ఉన్న వారు 27సంవత్సరాల అనం తరం కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకుని సంతోషంగా గడిపారు. ఈ మేరకు గురువులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 27సంవత్సరాల అనంతరం ఇలా కలుసుకోవడం సంతోషంగా ఉందని, ఇకముందు ప్రతీ సంవత్సరం కలుసుకునేలా తా మంతా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుంటున్నామని అన్నారు. అనంతరం వీరంతా సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఆనందంగా గడిపారు.

శ్రీ సిద్ధరామేశ్వర ఆలయానికి భక్తుల తాకిడి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

భిక్కనూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయానికి సోమవారం భక్తుల తాకిడి నెలకొంది. సెలవుదినం కావడంతో ఉదయం నుంచే ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని మూలబావి వద్ద స్నానమాచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారిని అందంగా తీరొక్కపూలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. కాగా ఆలయ ప్రాంగణంలో భక్తులు అభిషేకాలు, గండదీపం, కోడెలను కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని చాటాలి : ఎస్సై సుధాకర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై సుధాకర్

లింగంపేట, జనవరి 13(ఆంధ్ర జ్యోతి): క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలని లింగంపేట ఎస్సై సుధాకర్ అన్నారు. లింగంపేట మండలంలోని ముస్తాపూర్ ఏర్పాటు చేసిన ఎల్లారెడ్డి డివిజన్ స్థాయి క్రీడా పోటీలను ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడల్లో పాల్గొనడంతో యువతలో స్నేహాబావం ఏర్పడుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో డివిజన్ స్థాయి క్రీడలను నిర్వహించడం అభినందనీయమని, క్రీడాకారులు గెలుపుఓటములను సామానంగా తీసుకోవాలన్నారు. అనంతరం నిర్వాహకులు నరేష్, అరవింద్, భువర్ధన్, మహేష్, మహేందర్ మాట్లాడుతూ వాలీబాల్ క్రీడకు సంబంధజంచి ఎల్లారెడ్డి వ్యాప్తంగా 36జట్లు పాల్గొంటున్నామని, ఈ క్రీడలు రెండు రోజులపాటు కొనసాగుతాయన్నారు.

16 నుంచి శివమాలధారణ దీక్ష

దోమకొండ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం నుంచి శివమాలధారణ మండల దీక్ష చేపట్టనున్నట్లు శివసేవ సమితి దోమకొండ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివమాలధారణ చేసే భక్తులను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. 99481 10425,96662 08897,94912 30432 నంబర్లను సంప్రదించాలన్నారు.

మోడల్ పాఠశాలలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్పల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ అంతుల్‌బారీ తెలిపారు. పాఠశాలలో 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు 2025-26 సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నామని ఆమె పేర్కొన్నారు. దరఖాస్తులకు చివరి తేదీ ఫిబ్రవరి 28 వరకు ఉందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 13న ఎంట్రెన్స్ ఉంటుందని ప్రిన్సిపాల్ చెప్పారు.

తిమ్మాపూర్‌లో నీటిఎద్దడి తీర్చిన ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో నీటి ఎద్దడి ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు మంజూరు చేసి సోమవారం గ్రామంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో బోరు వేయించారు. నీరు పుష్కలంగా పడడంతో నీటి సమస్య తీరిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ సాయిలు, నాయకులు సామెల్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.



తిమ్మాపూర్ గ్రామంలో బోరు వేస్తున్న దృశ్యం

నియోజకవర్గ అభివృద్ధే పోచారం లక్ష్యం : కాంగ్రెస్ నాయకులు



బాన్సువాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల నాయకులు

బాన్సువాడ, జనవరి 13 (ఆంధ్ర జ్యోతి): బాన్సువాడ నియోజకవర్గ అభి వృద్ధి ప్రజల సంక్షే మమే ధ్యేయంగా ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పని చేస్తారని బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు దుద్దాల అంజిరెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షులు కాలేక్‌లు అన్నారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత బాన్సువాడ పర్యటన సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన అభివృద్ధి చూసి పోగడారని వారికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తారు తప్ప తమకు ఎవరైనా అవమానిస్తే సహించరు అని అన్నారు. వారు అన్నిరకాలుగా ఆలోచించే బాన్సువాడ అభివృద్ధి కోసమే వారు పార్టీ మారారని అన్నారు. తెలంగాణాలో ఎక్కడా లేని విధంగా నిధులు తెచ్చి, అభివృద్ధి చేసిన గొప్ప నాయకుడు పోచారం అని కవిత పొగడడం ఆయనకు ఉన్న ప్రత్యేకతను తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మా నాయకునిపై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించమని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, సీనియర్ నా యకులు కృష్ణారెడ్డి, ఎజాజ్, మోహన్ నాయక్, నార్ల రవీందర్, నార్ల సురేష్ అఫ్రోజ్ దాసరి శీను, రఫీ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. గోదా రంగనాథ స్వామి కల్యాణం



టీటీడీలో శ్రీవారి పల్లకీ సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం

బీర్కూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ గోదా రంగనాథ స్వామి వార్ల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ఆలయ ధర్మ కర్తలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యుడు పోచారం శ్రీనివాస రెడ్డి, శంభురెడ్డిలు కుటుంబ సమేతంగా కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం గోదాదేవి రంగనాథ స్వామిలను పల్లకిలో ఉంచి మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించి తరించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీర్కూర్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బీబీపేటలో ..



గోదాదేవి రంగనాయకుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

దోమకొండ,(బీబీపేట) జనవరి 13(ఆంధ్ర జ్యోతి):బీబీపేట మండల కేంద్రంలోని శ్రీ వేణు గోపాలస్వామి ఆలయంలో సోమవారం శ్రీ గోదాదేవి రంగనాయకుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

ఆర్చరీ క్రీడాకారులకు సన్మానం



ఆర్చరీ క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం

దోమకొండ, జనవరి 13(ఆంధ్రజ్యోతి):దోమకొండకు చెందిన ఆర్చరీ క్రీడాకారులు కదిరె సింధుజ, ఎం.అనుదీప్‌లు ఆర్చరీ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సీఎం కప్ రాష్ట్రస్థాయిలో సింధుజ కాంస్య పతకం, రాజస్థాన్‌లో సబ్ జూనియర్ నేషనల్ పోటీల్లో అనుదీప్ కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం గడికోటలో వారిని ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీగల తిర్మల్‌గౌడ్ సన్మానించారు. కార్యక్రమంలో కోచ్ ప్రతాప్‌దాస్ మోహన్‌రెడ్డి, పీడీ నర్సింహారెడ్డి, పిన్నం రాంచంద్రం, పున్న లక్షణ్, గంగాధర్ పాల్గొన్నారు.

శ్రీ సిద్ధరామేశ్వర ఆలయానికి ఇంజనీర్ విరాళం



విరాళాన్ని అందజేస్తున్న ఇంజనీర్

భిక్కనూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ అభివృద్ధికి మండల కేంద్రానికి చెందిన సాంసంగ్ రీసర్చ్ ఇంజనీర్ గజ్జెల శ్రీలేఖ సోమవారం రూ.18వేల విరాళాన్ని అందజేసినట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి, అన్నదాన కార్యక్రమానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం దాత కుటుంబ సభ్యులను ఆలయ సిబ్బంది, అర్చకులు శాలువాతో సన్మానించి స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో న్యాయ వాది గజ్జెల భిక్షపతి, వాణి, బార్గవి, వెంకట సాయి పాల్గొన్నారు.

రేపు ఎల్లారెడ్డిలో క్రికెట్ టోర్నీ

ఎల్లారెడ్డి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్‌డిపో స్థలంలో ఈనెల 15న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా వారి తల్లిదండ్రులు జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 15 నుంచి 17 వరకు నిర్వహించే టోర్నమెంట్‌లో ఎల్లారెడ్డి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల యువకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పాల్గొనే క్రీడాకా రులు మంగళవారం లోగా వారి వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపార. విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతి రూ.12,777, రెండో బహుమతి రూ.8,777 ఉంటుందని క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

సదాశివనగర్, జనవరి 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని అమర్లబండలో కరీంనగర్ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటిలు నిర్వహించారు. డెయిరీ నిర్వహకులు నిర్వహించిన ముగ్గుల పోటిలలో మహిళలు విద్యార్థినులు పాల్గొని చక్కని ముగ్గులు వేశారు. ముగ్గులు వేసిన వారిలో ఉత్తమ ముగ్గులను ఎంచుకొని బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంనిర్వహకులు, గ్రామపెద్దలు, యువకులు, మమిళలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- రోటి కపడా రోమాన్స్
దర్శన్	- యూఐ
ప్రియా 70	- పుష్ప-2
ప్రియా 35	- గేమ్ చేంజర్

బాన్సువాడ

మహేశ్వరి	- పుష్ప-2
వెంకటేశ్వర	- మ్యాక్స్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

